


### నిందితుల కోసం గాలిస్తున్నాం : రూరల్ సీఐ గాంధీ నాయక్

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మల్లికార్జున వైన్స్ వద్ద జరిగిన గొడవలో యువకుడు చనిపోయిన మాట వాస్తమే.. ఇందుకు కారకులైన వారి కోసం గాలిస్తున్నామని 'నమస్తే తెలంగాణ ప్రతినిధికి' మహబూబ్‌నగర్ రూరల్ సీఐ గాంధీ నాయక్ వివరించారు. మొత్తం పది మందిపై మర్డర్ కేసు నమోదు చేశామని, నిందితులను ఒకటి, రెండు రోజుల్లో అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలిస్తామన్నారు. సదరు వైన్స్ యజమానులపై చర్యలు తీసుకోవాల్సింది ఎక్సైజ్ అధికారులని, అది తమ పరిధిలోకి రాదని చెప్పుకొచ్చారు.



# రెచ్చిపోతున్న మద్యం మాఫియా!

## సీఎం ఇలాకాలో సంచలనం రేపిన ఘటన

- పాలమూరులో బీర్ల కోసం వెళ్తే యువకుడిని కొట్టి చంపిన వైనం
- ఫిర్యాదు చేసేందుకు వెళ్తే.. పోలీసుల వార్నింగ్
- ఖద్దరు అనుచరుల అరాచకానికి సలాం కొడుతున్న ఖాకీలు?
- అధికార పార్టీ అండతో స్వేచ్ఛగా తిరుగులాట
- అసలు సూత్రధారులను వదిలేందుకు యత్నం ?

మహబూబ్‌నగర్, మే 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : బీర్ల కోసం స్నేహితులతో కలిసి వెళ్లిన ఆ యువకుడిని వైన్స్ యాజమాన్యం విచ్చలవిడిగా దాడి చేసి కొట్టి చంపింది. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో సంచలనం రేపి 34 రోజులు అవుతున్నా దాడి చేసిన సదరు దుకాణం యాజమాన్యం మాత్రం పబ్లిక్‌లో తిరుగుతున్నారు. పోలీస్ కుటుంబానికి న్యాయం చేయాల్సిన పోలీసులు దాడి జరిగిన రోజు ఫిర్యాదు తీసుకోకుండా.. సదరు యువకుడు చనిపోయాక ఎఫ్ఐఆర్ నమోదు చేయడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. సాక్షాత్తు ముఖ్యమంత్రి రేవంత్ సొంత జిల్లాలో ఓ యువకుడు వైన్స్ షాపు వద్ద జరిగిన దాడిలో చనిపోతే ఆ కుటుంబానికి న్యాయం దొరకని పరిస్థితి. ఈ వైన్స్ యాజమాన్యం వెనుక కొందరు అధికార పార్టీ నాయకుల అండదండలు ఉండడంతో పోలీసులు వెనుకంజ వేస్తున్నట్లు తెలిసింది. ఎక్సైజ్ మంత్రి సొంత జిల్లాలో ఈ ఘటన జరిగినా సంబంధిత శాఖ అధికారులు కనీసం సదరు వైన్స్‌షాపుపై చర్యలు తీసుకోకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తున్నది. తమ కొడుకును అన్యాయంగా చంపేశారంటూ ఆ కుటుంబం కనబడిన వారందరికీ కన్నీరుమున్నీరై చెబుతున్నది. చర్యలు తీసుకోవాల్సి న యంత్రాంగం పూర్తిస్థాయిలో అధికార పార్టీకి వత్తా సు పలుకుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో వైన్స్ మాఫియా రాజ్యమేలుతోంది. సిండికేట్‌గా మారి ఇష్టం వచ్చిన రేట్లు పెంచి అమ్ముతున్నా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా కర్ణాటక నుంచి మద్యం దిగుమతి అవుతున్నా.. నకిలీ మందు విచ్చలవిడిగా వైన్స్ షాపుల్లో అమ్ముతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. దుకాణాల వద్ద ప్రైవేట్ గూండాలను నియమించుకోవడం.. కస్టమర్లపై దాడులకు దిగడం.. బెల్టు షాపులకు మందు సరఫరా చేయడం.. నిత్యకృత్యంగా మారింది. ఫలితంగా ఓ యువకుడు వైన్స్ మాఫియా కు బలైపోయాడు. నేరస్తులు, దొంగల పాలిట సింహస్వప్నమైన పోలీసులకు డ్రైవర్ అవుదామనుకున్నాడు.. అతని చెల్లి ట్రైనీ ఎస్సైగా పోలీస్ అకాడమీలో శిక్షణ తీసుకుంటున్నది. బంధువుల గృహప్రవేశానికి వచ్చిన యువకుడు అన్యాయంగా మృతి చెందాడు. నాటి నుంచి న్యాయం కోసం ఆ కుటుంబం కన్నా కష్టాలు పడుతున్నది. ఇందుకు సంబంధించిన వివరాలిలా..

మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలం బలీదుపల్లికి చెందిన శ్రీకాంత్ యాదవ్ జిల్లా కేంద్రంలో ఏప్రిల్ 24న సమీప బంధువుల గృహ ప్రవేశానికి హాజరయ్యాడు. బంధువులు బీర్లు కావాలంటే పట్టణంలోని బండమీదిపల్లి వద్ద శ్రీ మల్లికార్జున వైన్స్ వద్దకు స్నేహితులతో కలిసి వెళ్లాడు. అప్పటికే అక్కడ చిన్న గొడవ జరుగుతుంది. ఇది గమనించిన శ్రీకాంత్ తమకు బీర్లు కావాలని అడిగాడు. బీర్లు ఇచ్చాక కౌంటర్‌లో ఉన్న ఒక వ్యక్తి దురుసుగా మాట్లాడాడు. ఎందుకిలా మాట్లాడుతున్నావు అని ప్రశ్నిస్తే దుర్భాషలాడాడు. స్నేహితులు వారించడంతో శ్రీకాంత్ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. రోడ్డు దాటి వెళుతున్న అతడి వద్దకు వైన్స్ షాపునకు చెందిన కొందరు వచ్చి ఓనర్ పిలుస్తున్నాడంటూ చెప్పారు. వెనక్కి వచ్చిన ఆ యువకుడిపై అరుణ్ కుమార్‌రెడ్డి, కృష్ణారెడ్డి, బబ్లూ, వెంకటేశ్, శివశంకర్‌తోపాటు కొందరు దారుణంగా కొట్టారు.

అంతటితో ఆగకుండా వైన్స్ వెనక్కు తీసుకెళ్లి రూమ్‌లో వేసి విచక్షణా రహితంగా దాడికి తెగబడ్డారు. శ్రీకాంత్‌తో పాటు వెళ్లిన అతడి సమీప బంధువు రాఘవేంద్ర కుటుంబీకులకు సమాచారం అందించారు. శ్రీకాంత్ తండ్రి వచ్చి తీవ్ర గాయాలతో ఉన్న కొడుకును తీసుకెళ్లాడు.

### నాలుగు రోజులకే ముదిరిన ఆరోగ్యం

మూగదెబ్బలకు గురైన శ్రీకాంత్ అదే రోజు జిల్లా కేంద్రంలోని ఓ దవాఖానకు తీసుకెళ్లగా చికిత్స చేసి మందులిచ్చి పంపించారు. ఇది జరిగిన వారం రోజులకే పరిస్థితి విషమించింది. వెంటనే కొత్తకోటలోని రాహుల్ దవాఖానకు యువకుడిని తీసుకెళ్లగా.. ఇన్ని దెబ్బలు తగిలితే ఏం చేస్తున్నారని కుటుంబీకులను ప్రశ్నించారు. అక్కడి నుంచి ఎస్‌వీఎస్‌కు తరలించగా.. శరీరంలోని భాగాలు దెబ్బతిన్నాయని, వెంటనే హైదరాబాద్‌కు తీసుకెళ్లాడని సూచించగా.. ఓవైసీ వైద్యశాలకు పరిస్థితి విషమించడంతో యశోద తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఈనెల 14న ఉదయం తెల్లవారుజామున మృత్యుఒడిలోకి చేరాడు.



శ్రీకాంత్ యాదవ్ చిన్నప్పటి నుంచి పోలీస్ కావాలని కలలుగనేవాడు. వాళ్ల నాన్న వెంకటేశ్ గ్రామపంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొడుకు, కూతురిని పోలీసులను చేద్దామని శ్రమించేవాడు. కూతురు తారక ఎస్సైగా సెలెక్ట్ కాగా.. ప్రస్తుతం పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతోంది. కొడుకు శ్రీకాంత్‌ని కూడా కానిస్టేబుల్‌గా చేయాలనుకున్నాడు. కానీ కానిస్టేబుల్ అయితే ఏముంటుంది పోలీస్ బాస్‌లు నిందితులను పట్టుకోవడానికి వెళ్లే వాహనానికి డ్రైవర్ అయితే బాగుంటుంది నాన్న అంటూ కష్టపడ్డాడు. ఇటీవల జరిగిన సెలక్షన్‌లోనూ కొన్ని మార్కులతో ఉద్యోగం కోల్పోయాడు. పోలీస్ అవుదామనుకున్న కుటుంబానికి పోలీసులు అన్యాయం చేయడం.. అధికార పార్టీకి వత్తాసు పలకడం.. తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

### పోలీస్ కుటుంబానికే దక్కని న్యాయం

వైన్స్ వద్ద తీవ్రంగా గాయపడిన శ్రీకాంత్ యాదవ్ ఇంటికి తీసుకెళ్లిన కుటుంబ సభ్యులు.. అదే నెల 26వ తేదీన మహబూబ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. ఆ సమయంలో అక్కడ డ్యూటీలో ఉన్న ఎస్సై విజయభాస్కర్ ఫిర్యాదు తీసుకోవడానికి నిరాకరించాడు. మీరు ఏమన్నా బడికి పోయారా..? గుడికి పోయారా? మీరే వైన్స్ వద్ద దౌర్జన్యం చేశారంటూ.. మీపై కేసు పెట్టి బొక్కలో వేస్తా.. అంటూ హెచ్చరించాడు. దీంతో భయపడిన సదరు కుటుంబీకులు వెనుతిరిగారు. ఈ విషయాన్ని ట్రైనీ ఎస్సైగా పనిచేస్తున్న తమ కూతురు తారకకు తెలిపారు. ఆమె సూచన మేరకు మరుసటి రోజు పోలీస్‌స్టేషన్‌కి వెళ్లి నా కొడుకును చాలా దెబ్బలు కొట్టారు.. ఫిర్యాదు తీసుకోవాలంటూ వేడుకున్నారు. అక్కడున్న సిబ్బంది కంప్లైంట్ తీసుకున్నాక వెళ్లిపోవాలని దబాయించారు.

### అందర్నీ బొక్కలో వేస్తాం : రూరల్ ఎస్సై వార్నింగ్



### వైన్స్ ఎదుట ఆందోళనకు అనుమతి ఇవ్వని పోలీసులు

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఓ వైన్స్ యజమానుల దాడిలో తీవ్రంగా గాయపడిన శ్రీకాంత్ యాదవ్ చనిపోగా ఆయన మృతదేహాన్ని తీసుకొని కుటుంబీకులు దాడి జరిగిన వైన్స్ ఎదుట ఆందోళనకు దిగారు. అప్పటికే విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. రూరల్ సీఐ గాంధీనాయక్ హడావుడిగా అక్కడికి చేరుకొని వారిని ఒప్పించి ఆందోళన విరమింపజేయించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం దవాఖానకు తరలించారు. అయితే ఏప్రిల్ 25, 26న వారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే సదరు యువకుడు మృతి చెందిన రోజు అంటే దాదాపు 18 రోజుల తర్వాత ఎఫ్ఐఆర్ చేయడం గమనార్హం. సంబంధిత వైన్స్ యజమానులు మాత్రం స్వేచ్ఛగా వ్యాపారం చేసుకుంటున్నారు. కుటుంబ సభ్యులు న్యాయం కోసం జిల్లా ఎస్పీని కలుద్దామంటే అపాయింట్‌మెంట్ దొరకడం లేదు. ఏఎస్పీని కలిసి ఫిర్యాదు చేసినా నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో యాదవ సంఘాలు ఆందోళన చేపట్టాయి.

### అధికార పార్టీ అండతో..

సాక్షాత్తు సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలో ఓ యువకుడిని వైన్స్ షాప్ ఎదుట కొట్టి చంపిన వైనంపై పోలీసులు కానీ.. ఎక్సైజ్ అధికారులు కానీ చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ యజమానుల వెనుక అధికార పార్టీకి చెందిన కొందరి హస్తముందని గుసగుసలు ఉన్నాయి. వైన్స్ వద్ద దాడి జరిగిందని జిల్లా మొత్తం కోడై కూస్తున్నా ఎక్సైజ్ అధికారులు కనీసం సదరు మద్యం దుకాణళం వద్దకు వెళ్లకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. సాక్షాత్తు ఎక్సైజ్ శాఖ మంత్రి ఇలాకాలో ఈ సంఘటన జరిగినా అధికార పార్టీ నేతలు కనీసం ఖండించలేదు. ఇకనైనా పోలీసు, ఎక్సైజ్ అధికారులు స్పందించి జరిగిన ఘటనపై విచారణ జరిపి న్యాయం చేయాలని శ్రీకాంత్ కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

### దాడి చేసిన వారిని వదిలేస్తారా?

- వేణు, మృతుడి బాబాయ్, బలీదుపల్లి

మా అన్న కొడుకు బీర్ల కోసం వెళితే వైన్స్ యాజమాన్యం ఇష్టం వచ్చినట్టు దాడి చేసింది. న్యాయం చేయమని పోలీసుల వద్దకు వెళితే పట్టించుకోలేదు. తీవ్రంగా గాయపడిన కొడుకును కాపాడుకునేందుకు దవాఖానల చుట్టూ తిరిగి రూ.లక్షలు ఖర్చు పెట్టినం. అయినా ప్రాణాలను కాపాడుకోలేకపోయాం. పోలీసులు మా అన్న కుటుంబానికి చేసే న్యాయం ఇదేనా..? మా శ్రీకాంత్‌పై దాడి చేసిన మద్యం దుకాణాన్ని సీజ్ చేసి యజమానులను అరెస్టు చేయాలి.. వారిపై క్రిమినల్ కేసులు పెట్టి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి. సీఎం రేవంత్ సొంత జిల్లాలో మాలాంటి పేదోళ్లకు న్యాయం జరగలేదు. మా కుటుంబ సభ్యులమంతా కలిసి సీఎం క్యాంప్ కార్యాలయం ముందు ఆందోళన చేపడుతాం..



మహబూబ్‌నగర్ ఎస్పీ కార్యాలయానికి ఫిర్యాదు చేసేందుకు వచ్చిన శ్రీకాంత్ కుటుంబ సభ్యులు



జూరాల ప్రాజెక్టులో ప్రస్తుత నీటి మట్టం

# జూరాలకు స్వల్ప వరద

ధరూరు, మే 17 : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు స్వల్ప వరద మొదలైంది. శుక్రవారం ఎగువ నుంచి ప్రాజెక్టుకు 2,561క్యూసెక్కుల వరద వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1,045 అడుగులకు గానూ ప్రస్తుతం 1,031.037 అడుగులకు (3.117 టీఎంసీలకు ప్రస్తుతం 0.000 టీఎంసీలు) చేరుకున్నది. వరద రాకతో తాగునీటి ఇబ్బందులు తీరుతాయనిఅ ధికారులుతెలి పారు.

### 'తుంగభద్ర'కూ..

అయిజ, మే 17 : ఎగువన కురుస్తున్న వర్షాలతో తుంగభద్రా నదికి స్వల్పంగా వరద కొనసాగుతున్నది. గురువారం రాత్రి కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్ట దిగువ పరిధిలో కురిసిన వర్షానికి వాగులు, వంకల ద్వారా నదికి వరద చేరుతున్నది. నిన్నటి వరకు తడారిన తుంగభద్రా నదికి వరద రాకతో జలకళను సంతరించుకున్నది. ఫలితంగా నదీతీర ప్రాంతాల ప్రజలకు నీటి కష్టాలు తీరనున్నాయి. అయిజ మండలం, పులికల్ సమీపంలోని నాగల్‌దిన్నె వద్ద వరద నీటితో తుంగభద్రా నది జలకళను సంతరించుకున్నది. ఈ ఏడాది తుంగభద్రా నదికి ముందస్తుగా వరద రావడంతో నదీతీర ప్రాంతాల రైతు లు నారుమళ్లు పోసుకునేందుకు సిద్ధమవుతున్నారు.



తుంగభద్ర నదిలో స్వల్పంగా ప్రవహిస్తున్న వరద

# గట్టులో భారీ వర్షం



అలంపూర్‌లో ఇండ్ల ఎదుట రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

- 9.8సెం.మీ.లుగా నమోదు
- అలంపూర్‌లోజ లమయమైన అక్బర్‌పేటకా లనీ
- చిన్నంబావి కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం
- ఒక్కసారిగా చల్లబడినవా తావరణం
- దుక్కులు దున్నే పనిలో రైతన్నల బిజీబిజీ

అలంపూర్/మల్దకల్/గట్టు/పెంట్లవెల్లి/మదనాపురం/మానవపాడు/వీపనగండ్ల, మే 17 : జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలకేంద్రంలో గురువారం రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు భారీ వర్షం కురిసింది. కాగా వర్షపాతం 9.8సెం.మీ.లుగా నమోదైందని ఏఎస్‌వో శ్రీనివాసులు తెలిపారు. మల్దకల్ మండలంలో 9.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తాసీల్దార్ జుబేర్ మొహినుద్దీన్ తెలిపారు. అదేవిధంగా కేటీదొడ్డి మండలంలో 72.2 మి.మీ., ధరూర్‌లో 42.1, గద్వాలలో 39, ఇటిక్యాలలో 30.1, మల్దకల్‌లో 16.4, అయిజలో 26.4, రా జోళిలో 13.3, వడ్డేపల్లిలో 30.5, మానవపాడులో 32.2, ఉండవెల్లిలో 18. 8, అలంపూర్‌లో 0.2 మి.మీటర్లు, పెంట్లవెల్లిలో 6.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. అలంపూరు మున్సిపాలిటీలో శుక్రవారం సాయంత్రం కురిసిన చిన్నపాటి వర్షానికే అక్బర్‌పేట కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

భారీ ఉష్ణోగ్రతలతో వేడెక్కిన భూమి గురు, శుక్రవారాల్లో కురిసిన వర్షానికి చల్లబడడంతో ప్రజలు ఉపశమనం పొందారు. కాగా కొన్నిచోట్ల ధాన్యం కాపాడుకోవడానికి అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ వర్షానికి దుక్కులు దున్నుకుని పొలాలను సిద్ధం చేసుకునే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు.

### తడిసిన ధాన్యం

చిన్నంబావి, మే 17 : మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో శుక్రవారం కురిసిన వర్షానికి ధాన్యం తడిసింది. పంటను అమ్ముకునేందుకు మండలకేంద్రంలోని కొనుగోలు కేంద్రానికి రైతులు ధాన్యాన్ని తీసుకొచ్చారు. అకస్మాత్తుగా వర్షం కురవడంతో ధాన్యం తడవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వమే కొనుగోలు చేసి మద్దతు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు. మండల వ్యాప్తంగా వర్షాలు కురవడంతో ఆయా గ్రామాల్లో రైతులు ఆరుతడి పంటలకు సన్నద్ధమవుతున్నారు.




చిన్నంబావిలో కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం

# కడుకుంట్ల చెరువులో చేపలు మృతి

- నీటిలోకి మురుగు చేరడమే కారణం

వనపర్తి, మే 17 : మండలంలోని కడుకుంట్ల చింతల చెరువులో చేపలు శుక్రవారం మృతి చెందడంతో మత్స్యకారులు ఆందోళన చెందారు. సమాచారం అందుకున్న సంబంధిత అధికారులు గ్రామానికి చేరుకొని చెరువులోని నీటిని శాంపిల్స్‌గా సేకరించారు. ఆ నీటిని మత్స్యకారులు పెబ్బేరులోని మత్స్యకళాశాల ల్యాబ్‌కు తీసుకెళ్లగా.. చెరువులోకి మురుగు చేరడంతోనే నీరు కలుషితమై చేపలు చనిపోయినట్లుతెలి పారు.



చింతలచెరు వులో మృతి చెందిన చేపలు



బున్యాదిపురంవద్ద లైనింగ్ ఊడిపోయి రాళ్లు తేలిన డీ-19 కాల్వ

# కాల్వలిలా.. నీరు పారేదెలా?

- దెబ్బతిన్న జూరాల పిల్ల కాల్వలు, డిస్ట్రిబ్యూటరీలు..
- నిర్వహణ మరిచిన అధికారులు
- ప్రమాదాలకు ఆస్కారముందంటున్న రైతులు

పెబ్బేరు, మే 17 : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాల్వ పరిధిలోని డిస్ట్రిబ్యూటరీలు, పిల్ల కాల్వలకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. పెబ్బేరు మండలంలోని పలు గ్రామాలకు సాగునీరు అందిస్తున్న ఈ కాల్వలు అక్కడక్కడా దెబ్బతినడంతో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతున్నది. సిమెంట్ లైనింగ్ ఊడిపోవడం, రాళ్లు తేలడం వంటి సమస్యలు ఉన్నాయి. మండలం మీదుగా ప్రధాన ఎడమ కాల్వతోపాటు 17, 18, 19, 20 డిస్ట్రిబ్యూటరీ కాల్వలు పారుతుండగా.. వీటి పరిధిలో వేలాది ఎకరాల ఆయకట్టు సాగులో ఉన్నది. కొన్నేళ్లుగా అధికారులు కాల్వల నిర్వహణను మరిచిపోయారు. ఫలితంగా నీటిని విడుదల చేసినప్పుడు అవి మరింత కోతకు గురై గండ్లు పడే అవకాశం ఉన్నది. గతేడాది వర్షాకాలం నీటి విడుదల సమయంలోనూ పెబ్బేరు వద్ద ప్రధాన కాల్వకు గండి పడి పెద్ద ప్రమాదం తప్పింది. ప్రతి వేసవిలో జూరా ల ప్రాజెక్టు నుంచి నీటి సరఫరాను నిలిపేస్తుంటారు. ఆ మూడు నెలల సమయంలోనైనా దెబ్బతిన్న కా ల్వలకు మరమ్మతులు చేపడితే ప్రయోజనకరంగా ఉంటుందని రైతులు అంటున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులను సంప్రదించేందుకు ప్రయత్నించగా వారు అందుబాటులో లేరు.

# సినిమా హాల్స్‌కు బ్రేక్

- మల్టీప్లెక్స్‌ల్లో రోజుకు రెండు షోలు..
- థియేటర్స్ యాజమాన్యం వెల్లడి

మహబూబ్‌నగర్ అర్బన్, మే 17 : రాష్ట్రంలో ప్రస్తు తం పెద్ద హీరోల సినిమాలు రిలీజ్ కావడం లేదు. ఫలితంగా థియేటర్లకు వెళ్లేవారి సంఖ్య పూర్తిగా తగ్గిపోయింది. దీంతో రాష్ట్ర సింగిల్ స్క్రీన్ థియేటర్స్ యజమానులు తాత్కాలిక విరామం ప్రకటించారు. శనివారం మహబూబ్‌నగర్‌లోని థియేటర్ల యజమానులను సంప్రదించగా.. ప్రేక్షకుల ఆదరణ తగ్గడం, ఓటీటీల్లో సినిమాలు ప్రసారం అవుతుండడంతో సినిమా హాల్ రోజు వారి వ్యయం భారంగా మారిందన్నారు. కొత్త సినిమాలు రిలీజ్ కావడం లేదని, అందుకే శుక్రవారం నుంచి వారం రోజుల పాటు షోలు నిలిపివేస్తున్నట్లు తెలిపారు. కాగా మల్టీప్లెక్స్‌లు యథావిధిగా కొనసాగుతున్నాయి. ఆదాయం తక్కువగా వచ్చినప్పటికీ రోజుకు రెండు షోలు నడిపిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.



ప్రేక్షకులు లేక వెలవెలబోతున్నథి యేటర్

# పుస్తక పఠనంతో మరింత జ్ఞానం

- కవులు నిత్య చైతన్యపరులు
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- ధిక్కార కవితా సంపుటి ఆవిష్కరణ

వనపర్తి, మే 17 : ప్రజలను చైతన్యం చేయడానికి కవులు నిత్యం చైతన్యపరులుగా ఉంటారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మాజీ మంత్రి స్వగృహంలో వనపట్ల సుబ్బయ్య, సంగిశెట్టి శ్రీనివాస్‌లు రచించిన ధిక్కార కవితా సంపుటిని నిరంజన్‌రెడ్డి ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజలను చైతన్యవంతులను చేయడంలో కవుల పాత్ర ముఖ్యమైనదన్నారు. బ్రిటీష్ పాలన మొదలు నేటి వరకు కవుల రచనలే ఉద్యమాలకు ఊపిరిని అందించాయన్నారు. కవుల రచనలు ఆహ్లాదాన్నివ్వడంతోపాటు చైతన్యాన్ని నింపుతాయన్నారు. మహానుభావుల చరిత్ర, వారు అనుసరించిన స్ఫూర్తిదాయక విధానాలను వెలుగులోకి తేవడంతో పాటు ప్రజలకు నైతికవిలువలను అందించే సత్తా వారిలో ఉంటుందన్నారు. వనపట్ల సుబ్బయ్య, శ్రీనివాసులు అదే కోవకు చెందినవారన్నారు. పుస్తక పఠనం వల్ల విజ్ఞానం పెరగడంతో పాటు పదిమందికి ఆదర్శంగా నిలిచే నిర్ణయాలు తీసుకోగలుగుతామన్నారు. కార్యక్రమంలో ప్రముఖ సమాజ విశ్లేషకుడు టెలిఫోన్ బలరాం, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కుమార్, సురేందర్, రాము, నర్సింహ, బాబూనాయక్ తదితరులు పాల్గొన్నారు.



కవితాస ంపుటినిఆ విష్కరిస్తున్న మాజీ మంత్రి సింగిరెడ్డిని రంజన్‌రెడ్డి

# ఆటోను ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

- తప్పిన పెను ప్రమాదం

ఉండవెల్లి, మే 17 : ఆగి ఉన్న ఆటోను బస్సు ఢీకొన్న ఘటన ఉండవెల్లి మండల శివారులోని వీకేర్ కోల్డ్ స్టోరేజ్ వద్ద చోటుచేసుకున్నది. స్థానికుల కథనం మేరకు.. కర్నూల్ జిల్లా పెద్ద టేకూరుకు చెందిన శేఖర్, డ్రైవర్ చిరంజీవితో కలిసి జొన్నల సం చులు విక్రయించేందుకు బయలుదేరాడు. శుక్రవారం తెల్లవారుజామున వర్షం కురుస్తుండటంతో ఉండవెల్లి శివారులోని వీకేర్ కోల్డ్‌స్టోరేజ్ వద్ద ఆటోను ఆపారు. ఈక్రమంలో పాండిచ్చేరి నుంచి 36 మంది ప్రయాణికులతో హైదరాబాద్‌కు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఆటోను ఢీకొట్టి పొలాల్లోకి దూ సుకెళ్లింది. ఘటనలో బస్సులోని ప్రయణికులతోపా టు ఆటోలోని వారికి ఎలాంటి గాయాలు కాలేదు.




ఆటోను ఢీకొని రోడ్డు దిగువకు దూసుకెళ్లిన బస్సు